ఈనాడు
ఆదిలాబాద్
గురువారం సెప్టెంబరు 26, 2024

నూనెలు సలసల.. పండగ ఎలా?

న్యూస్‌టుడే, రాంనగర్, ఇంద్రవెల్లి

తెలుగిళ్లలో పెద్ద పండగలు దసరా, దీపావళి, సంక్రాంతి వరుసగా రాబోతున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే నూనెలు, పప్పుల ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. పండగలు అంటేనే.. సకినాలు, గారెలు, బూరెలు, అరిసెలు చేసుకోవడం ఆనవాయితీ. నగరాల్లో ఉండే వారు కూడా సెలవుల్లో ఇంటికి వస్తారు. వాళ్లకు ఇష్టమైనవి చేసి పెట్టాలని ఉంటుంది. నూనె సెగలతో కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.


ఉమ్మడి జిల్లాలో ప్రతి నెల 40 లక్షల లీటర్ల నూనె వినియోగిస్తారు. నిరుపేదలతో పాటు హోటళ్లలో పామాయిల్ వినియోగం అధికంగా ఉంటుంది. ఇతర నూనెల ధరలతో పోలిస్తే లీటరుకు రూ. 20-30 తక్కువగా ఉండటంతో వీటిని వినియోగిస్తారు. ఇటీవల ఆరోగ్యంపై శ్రద్ధతో బ్రౌన్ రైస్ నూనె, ఆలివ్ ఆయిల్, కొబ్బరినూనెల వినియోగం పెరిగింది. బ్రాండెడ్ పేరిట కొన్నింటిని లీటరు 200 లకు పైగా విక్రయిస్తున్నారు.

జిల్లాలో కుటుంబాలు : **8.50 లక్షలు**

జనాభా: **28 లక్షలు**

నూనె నెల వినియోగం : **40 లక్షల లీటర్లు**

కుటుంబాలపై పడే అదనపు భారం: **రూ. 8 కోట్లు**



దిగుమతి సుంకం పెరగడంతోనే..

నూనెల ధరలు లీటరుకు సగటున రూ.20 పెరిగాయి. దిగుమతి సుంకం పెరగడంతోనే ధరలు పెరిగాయని నూనె వ్యాపారి సురేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూనెలపై సుంకాన్ని భారీగా పెంచడంతో సంస్థలు ఆ భారాన్ని ప్రజలపైనే మోపాయని ఆయన పేర్కొన్నారు. ముడిసరకుగా దిగుమతి చేసుకునే వంట నూనెలకు(క్రూడ్ ఆయిల్) గతంలో 12.5 శాతం సుంకం ఉండేది. తాజాగా కేంద్ర ప్రభుత్వం దీన్ని 32.5 శాతానికి పెంచడంతో భారం పెరిగిపోయింది. ఒక్కో కుటుంబం సగటున అయిదు లీటర్ల నూనెను వినియోగిస్తారు. ఈ లెక్కన నెలకు కుటుంబంపై రూ. 100 అదనంగా భారం పడుతోంది.

ధరలను నియంత్రించాలి

అరుణ, గృహిణి, శాంతినగర్



పెరుగుతున్న ధరలను ప్రభుత్వం నియంత్రించాలి. ప్రభుత్వాలు పన్నులు పెంచిన ప్రతి సారి ఆ భారం నేరుగా ప్రజలపైనే వేస్తున్నారు. దిగుమతి సుంకం పెరిగితే కంపెనీలు 50 శాతం కూడా భరించకుండా నేరుగా ధరలు పెంచేసి వినియోగదారులపైనే భారం మోపడం ఎంత వరకు సమంజసం.



సామాన్యులపై భారమే

టేకం భీంబాయి, మొలలగుట్ట, ఇంద్రవెల్లి మండలం

ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం పడుతోంది. గత నెల కంటే లీటరుకు రూ.20 నుంచి రూ.30 ధర పెరిగింది. సంతలో నాసిరకం కంపెనీల నూనె తీసుకొచ్చి అదే ధరతో విక్రయిస్తున్నారు. నూనెలు రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచి, రాయితీపై విక్రయిస్తే మాలాంటి పేదోళ్లకు కొంత మేలు జరుగుతుంది.

3 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు అక్టోబరు 3 నుంచి ప్రారంభమవుతాయని డీఈవో ప్రణీత తెలిపారు. ఇందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. పరీక్ష షెడ్యూలు, హాల్‌టికెట్లు కోసం అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

వసూలుకు దూరం.. బకాయిల భారం

● రిమ్స్ క్వార్టర్ల అద్దె రూ. 87.08 లక్షలకు చేరిన వైనం..

ఆయనో వైద్యుడు. రిమ్స్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తారు. 2021 నుంచి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పక్కనే రెండు పడక గదుల ప్రభుత్వ క్వార్టర్‌లో ఉంటున్నారు. నెల అద్దె రూ.11,973తోపాటు వినియోగించిన విద్యుత్తు ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె బకాయిలు మొత్తం రూ.3,35,244 చేరింది. విద్యుత్తు ఛార్జీలు ఇంకా అదనమే. ఇలా దాదాపుగా 25 మంది వైద్యులు అద్దె చెల్లించడం లేదు. మరో ఉద్యోగికి రిమ్స్ ఆసుపత్రితో సంబంధమే లేదు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఉద్యోగి అయినా 2017 నుంచి రిమ్స్ క్వార్టర్‌లోని ఒక పడక గదిలో అద్దెకు ఉంటున్నారు. నెల అద్దె రూ.6,877తో పాటు విద్యుత్తు ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు బకాయిలు మొత్తం రూ.3,22,818 చేరింది. ఇలా దాదాపు 28 మంది ఉద్యోగులు అద్దె చెల్లించకుండా మొండికేయటంతో రిమ్స్ ఆసుపత్రిపై ఆర్థిక భారం పడుతోంది.

ఈటీవీ – ఆదిలాబాద్

ఆదిలాబాద్ రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ఉద్యోగుల క్వార్టర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. విధుల అనంతరం కల గుండా అందులో పని చేసే వైద్యులు, వైద్య సిబ్బంది కోసం 2008లోనే ప్రభుత్వం 105 క్వార్టర్లను నిర్మించింది. ఇందులో రెండు పడక గదులవి 33, ఒక పడక గదివి 72 నిర్మించింది. అప్పట్లో ఒక పడక గది ఇంటి అద్దెను రూ.3 వేలు, రెండు పడకల ఇళ్ల అద్దెను రూ.5 వేలుగా నిర్ణయించింది. నెలవారీ అద్దెతో పాటు వినియోగించిన విద్యుత్తు ఛార్జీలను సైతం అద్దెకు ఉన్న వారే భరించాలనేది నిబంధన. తర్వాత 2021లో రూ.3 వేల ఇళ్ల అద్దెను రూ.6,877కు, రూ.5 వేల ఇళ్ల అద్దెను రూ.11,973కు ప్రభుత్వం పెంచింది. అప్పటి నుంచి ఎవరూ అద్దె చెల్లించక బకాయిల మొత్తం రూ.87,08,343కి చేరింది. దీనికి అదనంగా రూ.30 లక్షల వరకు విద్యుత్తు ఛార్జీ ఉంటాయనేది ప్రాథమిక అంచనా. అద్దె వసూళ్ల కోసం వెళ్లే సిబ్బందిని కొంతమంది ఉద్యోగులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ఇళ్ల వివరాలు

ఇళ్లు	బోధకులు	బోధనేతరులు
రెండు పడకల	12	24
ఒక పడక	48	21
మొత్తం	60	45



రిమ్స్ క్వార్టర్లు

హెచ్‌ఆర్‌ఏ ఉంటే మేలు

రెగ్యులర్ ఉద్యోగులైతే ఇంటి అద్దె(హెచ్‌ఆర్‌ఏ) పేరిట ప్రభుత్వమే చెల్లిస్తోంది. వేతనాలు ఇచ్చేటప్పుడు అందులోనే కోత పడుతుంది. అలాంటి వారితో ఏ ఇబ్బంది లేదు. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారితోనే సమస్య తలెత్తుతోంది. ఏకమొత్తంగా క్వార్టర్లను ఖాళీ చేయిస్తే ఇబ్బందులు తలెత్తుతాయనే భావనతో చర్యలు తీసుకోవడం లేదు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా: జైసింగ్, డైరెక్టర్

నేను 2022 డిసెంబరులో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టాను. అంతకుముందు నుంచే అద్దె సమస్య ఉంది. 2021లోనే ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బకాయిలు వసూళ్లు చేస్తాం.

సగం చెరువులు మాయం

● రక్షణకు కమిటీలు



జిల్లా	మొత్తం	ప్రస్తుతం	మాయం
నిర్మల్	1,149	791	358
ఆదిలాబాద్	577	458	119
మంచిర్యాల	1,297	890	407
ఆసిఫాబాద్	1,498	563	935

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే

ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చేపట్టిన సర్వే వివరాల మేరకు 7,380 నీటివనరులుండగా వాటిలో 4,521 చెరువులను గుర్తించారు. ఈ పథకం ముగిసేలోపు 1,491 చెరువులను బాగు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలపై దృష్టి సారించిన ప్రభుత్వం తాజాగా జిల్లాలవారీగా చెరువుల రక్షణపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా చెరువుల సరిహద్దులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

◆ ఆదిలాబాద్ పట్టణ పరిధిలో 12 చెరువులు, కుంటలు కలిపి 518 ఎకరాల్లో విస్తరించి ఉండాలి. ఇందులో ఇప్పటికే వందల ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది. ఆదిలాబాద్ పట్టణం నడిబొడ్డున ఉన్న ఖానాపూర్ చెరువు 114 ఎకరాల్లో ఉండాలని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇది ఆక్రమణలకు గురై 60 ఎకరాలకు చేరింది. దీన్ని ట్యాంకుబండ్ మాదిరి చేయాలని గత ప్రభుత్వం రూ. 4 కోట్లు మంజూరు చేసింది. చెరువు ఆక్రమణలకు గురికావడంతో పనులు పూర్తి చేయలేకపోయారు. పట్టణ పరిధిలోని మరో అయిదు చెరువులు అన్యాక్రాంతం అవుతున్నాయి. జిల్లాలో 119 చెరువుల జాడ లేకుండా ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా పాలనాధికారి సంబంధిత అధికారులతో కమిటీ వేశారు.

◆ మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో నిజాం కాలంలో ఏడు చెరువులను గొలుసుకట్టుగా అభివృద్ధి చేశారు. దొనబండ వాగు మత్తడి నుంచి మొదలు ఇటిక్యాల చెరువు వరకు మధ్యలో అయిదు చెరువులు నిర్మించారు. కాలువల ద్వారా ఒకటి నిండగానే మరో చెరువుకు నీరందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కాలువలు, చెరువు భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయి. బెల్లంపల్లిలోని రైల్వే రడగంబాలబస్తీ జాతికుంట చెరువు 48 ఎకరాల్లో ఉండేది. అలాంటిది తాజా లెక్కల మేరకు తొమ్మిది ఎకరాలకే పరిమితం అయింది.

1,819 చెరువులు మాయం

ఉమ్మడి జిల్లాలో గత లెక్కలు, తాజా వివరాలతో పోలిస్తే 1,819 చెరువులు మాయమైనట్లు తెలుస్తోంది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా గతంలో గ్రామాలవారీగా సర్వే నిర్వహించారు. అప్పటి లెక్కల మేరకు ఉమ్మడి జిల్లాలో 4,521 చెరువులు ఉండాలి. కానీ ప్రస్తుతం నీటిపారుదలశాఖ లెక్కల మేరకు 2,702 చెరువులు ఉన్నాయి. అందులోనూ వంద ఎకరాల్లో సాగు నీరందించేవి 668 ఉండగా మిగిలిన 2034 చెరువులు వంద ఎకరాలకుపైగా సాగు నీటిని అందిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చెరువు భూములకు పట్టాలు పుట్టుకొచ్చాయనే ఆరోపణలున్నాయి. ఉమ్మడి జిల్లాలో 50 శాతం చెరువు భూములు కబ్జాలోనే ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల ప్రకారం నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సర్వే చేపడితే చెరువుల లెక్కలు తేలే అవకాశం ఉంది.

◆ నిర్మల్ పట్టణ పరిధిలోని చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. మంజులాపూర్ చెరువు 46.07 ఎకరాల్లో విస్తరించి ఉందని అధికారిక రికార్డుల్లో ఉండగా పలువురు దర్జాగా కబ్జా చేస్తుండటంతో కొద్దిరోజుల్లో చెరువు కనుమరగయ్యేలా ఉంది. కంచరోని, ఇబ్రహీం, రాంసాగర్, గొల్లపేట, ధర్మసాగర్, కురన్నపేట, పల్లెచెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. జిల్లాల్లో ఇప్పటికే 358 చెరువులు మాయమైపోయాయి.



నిర్మల్ పట్టణం ఎన్టీఆర్ మార్గ్ భాగ్యనగర్ వద్ద కబ్జాకు గురవుతున్న మంజులాపూర్ చెరువు

గురి చూసి కొట్టాలి!



విధి నిర్వహణలో భాగంగా అరాచక శక్తులను అంతమొందించేందుకు పోలీసులు ఏకాగ్రతతో గురిచూసి కొట్టాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. బుధవారం తలమడుగు మండలం సుంకిడి శివారు ప్రాంతంలో నిర్వహించిన పోలీసు ఫైరింగ్ భట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శిక్షణ కానిస్టేబుళ్లకు ఆయుధాలపై అవగాహన కల్పించారు. ఫైరింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదనపు ఎస్పీ ఆపరేషన్ సురేందర్‌రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, పోతారాం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, తలమడుగు

నాడు వద్దని.. నేడు కావాలని!

● ఎంఈవో నియామకాల్లో తెరపైకి కొత్త వివాదం

న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

ప్రస్తుత ఎంఈవోలతోపాటు మండల నోడల్ అధికారులు (ఎంఎన్‌వో)గా ఉన్నవారికే తాజాగా ఎంఈవోలుగా బాధ్యతలకు అప్పగించడం కొత్త వివాదానికి తెరలేపుతోంది. గతంలో సీనియర్లుగా ఉన్న వారికే ఎంఎన్‌వోలుగా ఇవ్వాలని నిర్ణయించినా.. అప్పట్లో కొందరు ఆ బాధ్యతలు తీసుకునేందుకు ముందుకు రాలేదు. వారి స్థానాల్లో ఇతరులను ఎంఎన్‌వోలుగా నియమించారు. జిల్లాలో బుధవారం 17 మంది కొత్తగా ఎంఈవోలుగా బాధ్యతల్లో చేరారు. రెండేళ్ల కిందట జరిగిన ఈ వ్యవహారంపై నోరుమెదపని సీనియర్లు ఇప్పుడు తమకంటే జూనియర్లకు ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ వ్యవహారంలో ఓ మండలానికి చెందిన పీజీహెచ్‌ఎం అప్పట్లో తన నుంచి రాతపూర్వకంగా ఎలాంటి పత్రం తీసుకోలేదని, ఇప్పుడు తనకే ఎంఈవో బాధ్యతలు ఇవ్వాలంటూ ఏకంగా డీఈవో కార్యాలయానికి వచ్చి అధికారులతో వాదనకు దిగడం చర్చనీయాంశంగా మారింది. ఇదే అదనుగా మరికొందరు తమ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. అప్పట్లో నోడల్ అధికారి బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి చూపని వారు ఇప్పుడు ఎంఈవోలుగా తమ పేరిట ఉత్తర్వులు ఇవ్వాలని పట్టుబట్టడం విద్యాశాఖలో తలనొప్పి వ్యవహారంగా తయారైంది. గతంలో ఎంఈవోగా పని చేసి ఆ తర్వాత పాఠశాల హెచ్‌ఎం బాధ్యతలకే పరిమితమైన మరొకరు సైతం తిరిగి తనకు పాత బాధ్యతలు ఇవ్వాలని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ వివాదంతో గతంలో ఎంఈవో పదవిని కోల్పోయిన ఒకరు ఆ పదవిని తిరిగి పొందేందుకు రాష్ట్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చినా ఫలితం లేకపోగా.. ప్రభుత్వ తాజా నిర్ణయంతో తిరిగి ఆయనే ఎంఈవోగా నియమితులయ్యారు.

'యువ' జోష్



జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. యువత జానపద, శాస్త్రీయ, పాశ్చాత్య అంశాల్లో నృత్యాలు చేసి వీక్షకుల్లో జోష్ నింపారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఉత్సవంలో పాల్గొని తమ ప్రతిభతో ఉర్రూతలూగించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ డిప్యూటీ సీఈఓ కాళిందిని మర్రిపూడి మాట్లాడుతూ చదువుతో పాటు సాంస్కృతిక అంశాలు కూడా ముఖ్యమేనన్నారు. వివిధ అంశాల్లో ఉత్తమంగా నిలిచినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని జిల్లా యువజన క్రీడల అధికారి వేంకటేశ్వర్లు తెలిపారు. డీఐఈవో సి.రవీంద్రకుమార్, జిల్లా సైన్స్ అధికారి కె.రఘురమణ ఉన్నారు.

\- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం



నృత్యం చేస్తున్న యువతులు

మున్సిపల్ కార్మికుల ధర్నా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : బకాయి వేతనాల చెల్లింపు, ప్రతి నెల అయిదో తేదీన వేతనాలు ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శ్యామలదేవికి అందజేశారు. సంఘం అధ్యక్షులు దర్శనాల నగేష్, నాయకులు ఆత్మారాం, జనార్దన్, అజీమ్, శివప్రసాద్, గంగన్న, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధికే పరీక్షలు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : నేరాల దర్యాప్తులో పోలీసుల్లో మరింత నైపుణ్యం పెంచటానికే డ్యూటీ మీట్‌లను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. పోలీసు హెడ్ క్వార్టర్‌లో బుధవారం పోలీసులకు డ్యూటీ మీట్ నిర్వహించారు. కేసుల దర్యాప్తు, నేర పరిశోధన, ఫింగర్ ప్రింట్స్, డాగ్‌స్క్వాడ్, బాంబు డిస్పోజల్, ఫొటోగ్రఫీలో నిర్వహించిన పరీక్షలను ఆయన పరిశీలించారు.

దాతల రక్తం ఎటు పోతోంది?

రక్తదానం ప్రాణదానంగా అభివర్ణిస్తారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇది దారి తప్పుతోంది. శిబిరాలు నిర్వహించి సేకరించిన దాంట్లో కొంతే రిమ్స్ రక్తనిధి కేంద్రానికి చేరుతుండగా మిగతాది ప్రైవేటు బ్లడ్ బ్యాంకుకు తరలుతోంది. ఫలితంగా పేదలు అత్యవసర వేళల్లో రక్తం బయట నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

● ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌కు అధికారుల సహకారం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం, ఎదులాపురం

నాయకుల పుట్టిన రోజును పురస్కరించుకొని జిల్లాలో పలు చోట్ల శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అభిమానులు, ప్రజలు భారీగా ముందుకొచ్చి రక్తదానం చేస్తున్నారు. వీటివల్ల ఎంతో మంది నిరుపేద రోగుల ప్రాణాలకు ఆసరాగా ఉంటోంది. వీరిని చూసి యువకులు పుట్టిన రోజు, ఆప్తుల జయంతి పురస్కరించుకొని సందర్భంగా శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. సేకరించిన రక్తంలో చాలా వరకు ప్రైవేటు బ్లడ్‌బ్యాంకుకు వెళుతుందనేది ఎవరూ పట్టించుకోవడం లేదు.

శిబిరం ఏర్పాటు ఇలా..

ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు కోసం నిర్వాహకులు రిమ్స్ సంచాలకుడికి దరఖాస్తు చేసుకుంటే సిబ్బందిని పంపించి రక్తాన్ని సేకరించే ఏర్పాట్లు చేస్తారు. ఒక వేళ దాతలు 20 మంది కంటే ఎక్కువ ఉంటే అదనపు వైద్య సిబ్బంది కోసం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి నుంచి రిమ్స్ అధికారులు సహకారం తీసుకుంటారు. రెండు శాఖల సిబ్బంది కలిసి రక్తాన్ని సేకరిస్తారు. రిమ్స్‌లోని కేంద్రానికి నిల్వలు పంపిస్తారు. దాదాపు 2 వేల యూనిట్ల సామర్థ్యం ఉన్న రిమ్స్‌లో ఎప్పుడూ కొరతే వేధిస్తోంది.



శిబిరాల్లో రక్తదానం చేస్తున్న దాతలు(పాత చిత్రం)

ఇటీవల ముఖ్య నేతల శిబిరాలు పరిశీలిస్తే..

సందర్భం	శిబిరం నిర్వహించిన తేదీ	సేకరించిన రక్తం యూనిట్లు	రిమ్స్‌కు చేరింది
జోగు రామన్న జన్మదినం	2024 జులై 4	139	99
పాయల్ శంకర్ „	„ ఆగస్టు 4	1067	438
కంది శ్రీనివాస్‌రెడ్డి „	„ ఆగస్టు 5	195	85
జోగు రామన్న „	2023 జులై 4	605	397
పాయల్ శంకర్	„ ఆగస్టు 4	658	329

రక్తం నుంచి ఆర్‌డీపీ(ర్యాండమ్ డోనర్ ప్లేట్‌లెట్స్) తీస్తారు. డెంగీ, ఇతర జ్వరాలతో ప్లేట్‌లెట్స్ పడిపోయిన వారికి దీన్ని ఎక్కించి ప్రాణాలు కాపాడతారు. యూనిట్ రక్తమైతే రూ.1050, మిగతా ప్లేట్‌లెట్స్, ప్లాస్మా రూ.300ల చొప్పున ప్రైవేటు బ్లడ్ బ్యాంకులో విక్రయిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల యజమానులు తమ రోగుల కోసం ఈ ప్రైవేటు బ్లండ్ బ్యాంకునే ఆశ్రయిస్తుండటంతోనే దందా జోరుగా నడుస్తోందని తెలుస్తోంది.

ప్రైవేటుకు అనుమతి ఎలా?

ఆదిలాబాద్‌లో ప్రైవేటు బ్లడ్ బ్యాంకు ఒకటుంది. రిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరాలకు వీరిని ఎలా అనుమతిస్తున్నారనేది ఎవరికి అంతుపట్టడం లేదు. వైద్యారోగ్య శాఖలోని ఒకరిద్దరు అధికారులు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లాలో ఇటీవల జరిగిన ముఖ్య రాజకీయ నాయకుల శిబిరాల్లోనూ వీరు వచ్చి రక్తం తీసుకెళ్లారు. ప్రతి చోటా ఇదే తంతు సాగుతోంది.

జాగ్రత్త పడతాం..

జైసింగ్ రాఠోడ్, రిమ్స్ సంచాలకుడు

ప్రైవేటు బ్లడ్ బ్యాంకు నిర్వాహకులకు మా నుంచి ఎలాంటి ఆహ్వానం ఉండదు. పెద్ద ఎత్తున శిబిరం ఉంటే పడకలు సరిపోక ఎవరైనా వారిని ఆహ్వానించి ఉండొచ్చు. ఇక నుంచి శిబిరాల్లో ప్రైవేటు బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు రాకుండా జాగ్రత్త పడతాం.

వీరి చిత్తశుద్ధి.. కావాలి ఇతరులకు స్ఫూర్తి

● ఈ ఐఏఎస్‌ల కృషి చిరస్మరణీయం

ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వహించే అధికారులు కొందరైతే.. ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే పనుల కోసం అహర్నిశలు పాటుపడే వారు మరికొందరు. ఆ కోవకే చెందుతారు ఈ నలుగురు ఐఏఎస్ అధికారులు. ఉట్నూరు ఐటీడీఏ పీవోలుగా విద్యా, వైద్యం, ఉపాధితో పాటు కనీస సదుపాయాలు వారికి అందేలా చేసి అడవిబిడ్డల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. వీరి సేవలను నిత్యం యాది చేసుకుంటూనే ఉన్నారు ఇక్కడి గిరి'జనం'. వారే ముత్యాల రాజు, జనార్దన్ నివాస్, ఆర్వీ కర్ణన్, వరుణ్‌రెడ్డి. -న్యూస్‌టుడే, ఉట్నూరు



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేయాల్సిన బాధ్యత ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిపై ఉంది. ఐటీడీఏ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు అనేక మంది పీవోలు పని చేశారు. అందులో కొందరు ఉత్తమ సేవలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. 1987 నుంచి 1990 వరకు మూడేళ్లపాటు ఐటీడీఏ పీవోగా పని చేసిన పి.సుబ్రహ్మణ్యం ఆదివాసీ హృదయాలను గెలిచారు. గోండి భాషను నేర్చుకొని వారికి చక్కటి సేవలందించారు. ఆ తరువాత రెండు దశాబ్దాల తర్వాత నలుగురు అధికారులు సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.

సాంకేతికత ఈయన చొరవే


ఉట్నూర్-లాల్‌టెకిడిలోని ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల


ముత్యాల రాజు

ముత్యాల రాజు ఐఏఎస్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచిన ఈ అధికారి 31.03.2011 నుంచి 09.10.2012 వరకు ఇక్కడ పీవోగా పని చేశారు. పని తీరులో పారదర్శకత, నిర్ణయం తీసుకోవడంలో వేగం ఈయన సొంతం. పదో తరగతి పూర్తయ్యాక గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని గుర్తించి ఉట్నూరులో గురుకుల జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశారు. సాంకేతిక విద్యా మండలితో మాట్లాడి ఉట్నూర్-లాల్‌టెకిడిలో ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల నెలకొల్పడంలో సఫలీకృతులయ్యారు.

ప్రధాని మెచ్చిన అవ్వాల్ సేవలు


జనార్దన్ నివాస్

ఐటీడీఏ పీవోగా 2013 నుంచి 2014 వరకు పని చేసిన జనార్దన్ నివాస్ మారుమూల గిరిజనులకు మెరుగైన వైద్యమందించేందుకు విశేషంగా కృషి చేశారు. మాతా, శిశు మరణాలలో ఉమ్మడి ఆదిలాబాద్ దేశంలోనే మూడు, నాలుగు స్థానాలలో ఉండేది. ఈ గణాంకాలను చూసి దిగ్భ్రాంతికి గురైన పీవో జనార్దన్ నివాస్ గర్భిణులకు ఉచితంగా అంబులెన్స్ సేవలను అందించే అవ్వాల్(గోండి భాషలో అమ్మ) పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ఐటీడీఏలో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఎంతో గుర్తింపు పొందిన ఈ సేవలు కేంద్ర ప్రభుత్వాన్ని ఆకర్షించాయి. ప్రధాని మోదీ ఆయన సేవలను ప్రశంసించారు.


గర్భిణిని అంబులెన్స్‌లో తీసుకెళ్తూ..


'నీ కోసం జీవిస్తే నీలోనే జీవిస్తావు జనం కోసం జీవిస్తే జనంలో నిలిచిపోతావు' - డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

'గిరి' దివ్యాంగులకు వికాసం



ఉట్నూరులో ఏర్పాటుచేసిన వికాసం పాఠశాల


ఆర్వీ కర్ణన్

మూడేళ్లు ఐటీడీఏ పీవోగా పని చేసిన ఆర్వీ కర్ణన్ విస్తృతంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గిరిజనులతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆదివాసీ, గిరిజన దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక బడి లేక వారు చదువులకు దూరమవుతున్నారని గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సక్షం పాఠశాలకు దీటుగా ఉట్నూరులో వికాసం ప్రత్యేక బాలల బడిని ఏర్పాటు చేశారు. అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చారు. రాష్ట్రంలో తొలి గిరిజన దివ్యాంగ పాఠశాలగా ఈ బడి గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పాఠశాలకు ఇన్నోవేషన్ పురస్కారంతో సత్కరించింది.

అక్షర జ్యోతి.. యువతకు ఉపాధి

ఏడాది కాలం ఐటీడీఏ పీవోగా పని చేసిన వరుణ్‌రెడ్డి గిరిజన విద్యార్థుల చదువులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. వారిలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు 'అక్షర జ్యోతి' కార్యక్రమం చేపట్టి విద్యార్థులు చదువుల్లో రాణించేలా ప్రతి వారం పరీక్షలు, సబ్జెక్టుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహించారు. ఇంజినీరింగ్, ఐఐటీ చదువుతున్న పేద విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు.


గిరిజన విద్యార్థికి ల్యాప్‌ట్యాప్‌ను అందజేస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

మరో ముగ్గురు ఉపాధ్యాయులు..!

● ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో అరెస్టు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కలకలం సృష్టించిన యూబిట్ క్రిప్టోకరెన్సీ మోసం కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. విచారణలో భాగంగా ఇప్పటికే అయిదుగురిని రిమాండ్‌కు పంపిన పోలీసులు తాజాగా మరో ముగ్గురు ఉపాధ్యాయులను అరెస్టు చేశారు. వారిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఇందులో దాసరి రమేశ్ (కడెం మండలం కన్నాపూర్ పాఠశాల), కిరం వెంకటేశ్ గౌడ్ (కుభీరు మండలం దౌజీనాయక్ తండా పాఠశాల), బొమ్మిడి ధనుంజయ్ (ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాల పాఠశాల) ఉన్నారు.

ఖాతాల స్తంభన..

ఆన్‌లైన్ పెట్టుబడులతో అధిక రాబడులు వస్తాయని తప్పుడు వాగ్దానాలు చేస్తూ పెట్టుబడిదారులను ప్రలోభాలకు గురిచేస్తున్నారనేది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. పిరమిడ్ తరహాలో ఈ పథకాన్ని విస్తరించడంలో స్టార్ గుర్తింపు ఉన్న సభ్యులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు గుర్తించారు. విచారణలో భాగంగా ఈ పథకంతో ముడిపడిఉన్న 11 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. అనుమానం ఉన్న ఖాతాల్లో ఆర్థిక లావాదేవీలు పరిశీలిస్తూనే, ఆస్తుల గుర్తింపు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. అయితే.. కేసు దర్యాప్తులో భాగంగా నిధుల దుర్వినియోగం నిరోధించేందుకు, బాధితుల సొమ్ముకు భద్రత కల్పించేందుకు ఈ దశ కీలకంగా మారుతుందని పోలీసులు పేర్కొంటున్నారు.

రహస్య సమావేశాలు..

ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న వారంతా సభ్యులను ఆకర్షించేందుకు రహస్య సమావేశాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ఇదివరకు అరెస్టయిన వ్యక్తులతో సహా పలువురు కుట్రదారులు గత 8 నెలలుగా పలు చోట్ల రహస్యంగా సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ఇప్పటికే నాలుగు వేర్వేరు దేశాలకు వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది. విదేశీ ప్రయాణాలను సైతం తమ ప్రచారంలో ఓ ప్రధాన ఆకర్షణగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల చాలామంది సులభంగా వీరి మాటలు నమ్మి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని, మరింత సమాచారం సేకరించేందుకు అధికారులు సంబంధిత ఏజెన్సీలతో కలిసి ప్రయత్నాలు ముమ్మరం చేశామని పోలీసువర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా.. మొత్తం వ్యవహారంలో ప్రధాన కుట్రదారు బ్రిజ్ మోహన్ సింగ్ అని గుర్తించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇతడిపై ఇప్పటికే పలు కేసులు నమోదైనట్లు చెప్తున్నారు.

బాధితులు ముందుకురావాలి:

జానకి షర్మిల, ఎస్పీ, నిర్మల్

విచారణ, దర్యాప్తు పూర్తి పారదర్శకంగా కొనసాగుతోంది. బాధితులు ముందుకొచ్చి వివరాలు అందజేస్తే రికవరీ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. పోలీసులు సంప్రదించేవరకు చూడకుండా స్వచ్ఛందంగా ముందుకురావాలి. మోసపోయిన సొమ్మును రికవరీ చేసేందుకు, అసలైన యజమానులకు అప్పగించేందుకు చట్టపరమైన విధానాలు అవలంబిస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. యూబిట్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా నేరుగా తమను సంప్రదించాలి. దర్యాప్తు అధికారి అవినాశ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందం విచారణ కొనసాగిస్తోంది.

యజమాని లేకున్నా ఇంటికి చేరుకుంటాం



పంట సాగులో తోడుగా నిలిచే ఎడ్లు తమ యజమాని వెంట లేకపోయినా ఎడ్లబండిని ఇంటికి తీసుకెళ్లడం విశేషం. యజమాని ఇంటికి వెళ్లే దారి అలవాటు ఉండటంతో తోడుగా రైతు లేకుండానే నేరుగా ఇంటికి వెళ్తున్నాయి. ఇంద్రవెల్లి మండలం సమాక పంచాయతీ పరిధిలోని పాటగూడ గ్రామానికి చెందిన రైతు కుర్ర రాజేశ్వర్‌కు ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని పోతగూడ గ్రామ శివారులో సాగు భూమి ఉంది. సాయంకాలం సమయంలో రైతు ఎడ్లబండిపై పచ్చి గడ్డిని వేసి, బండి వెనకాల లేగదూడను కట్టి చేలో రోజంతా పని చేసిన ఎడ్లను ఇంటి దారి పట్టించారు. మూడు కి.మీ దూరంలోని యజమాని ఇంటికి వెళ్తూ.. అడ్డువచ్చిన వాహనాలను తప్పించుకుంటూ ఇలా వెళ్తున్న చిత్రాలను బుధవారం 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

సాధారణ వర్షపాతం.. సాగుకు ఊతం

నైరుతి రుతుపవనాలు రాష్ట్రం నుంచి నిష్క్రమించాయి. దీని ప్రభావంతో జూన్ రెండో వారం నుంచి ఇటీవలి వరకు వానలు కురిశాయి. సుమారు మూడున్నర నెలలపాటు కురిసిన వర్షం ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఉండగా నిర్మల్ జిల్లాలో మాత్రం సాధారణం కంటే ఒక శాతం ఎక్కువగా కురిసింది. ఆగస్టు రెండో వారం వరకు లోటు వర్షపాతం నెలకొన్నప్పటికీ ఆ తర్వాత తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో సగటున సాధారణ వర్షం నెలకొంది. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశించగా జూన్ 15 నుంచి పూర్తి స్థాయిలో విస్తరించింది. సెప్టెంబరు 23 వరకు నిష్క్రమించాయి. ఈ సారి కురిసిన వానలతో జలాశయాలు, నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగుకు ఊతమిచ్చింది.

-న్యూస్‌టుడే, మంచిర్యాల వ్యవసాయం


నిండుకుండలా ఎల్లంపల్లి


జలాశయాలకు జలకళ

నైరుతితో కురిసిన వానలకు ఉమ్మడి జిల్లాలోని పలు జలాశయాలు, చెరువులు, ఇతర నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని సాత్నాల, మత్తడి నిర్మల్ జిల్లాలోని కడెం, స్వర్ణ, శ్రీరాంసాగర్, సుద్దవాగు, మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి, ర్యాలీ, గొల్లవాగు, నీల్వాయి, కుమురంభీం జిల్లాలోని పీపీ జలాశయం, అడ, వట్టివాగు తదితర జలాశయాల్లోకి భారీగా నీరు చేరడంతోపాటు చెరువులు, వాగులు, ఇతర నీటి వనరులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఇవి పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి.



దండేపల్లి శివారులో సాగవుతున్న వరి

పచ్చని పంటలతో కళకళ..

నీటి వనరుల్లోకి సమృద్ధిగా నీరు చేరడంతో సాగు ఇబ్బందులు తొలగాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో పత్తి, సోయాబీన్, మిగతా మూడు జిల్లాల్లో పత్తి, వరి పంటలు ప్రధానంగా సాగవుతున్నాయి. పప్పుదినుసులు, మొక్కజొన్న కొంత మేర సాగు చేస్తున్నారు.



ఆదిలాబాద్ జిల్లాలో ఏడు శాతం అధికం



నైరుతి ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాధారణ వర్షపాతం 969.7 మిల్లీమీటర్లుకాగా 1041. మి.మీ నమోదైంది. ఇంద్రవెల్లి, గుడిహత్నూరు, ఆదిలాబాద్ గ్రామీణం, అర్బన్, తాంసి మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం కంటే 20 శాతం తక్కువగా నమోదైంది.

మంచిర్యాల జిల్లాలోని మూడు మండలాల్లో ..



మంచిర్యాల జిల్లాలోని కాసిపేట, కన్నెపల్లి, కోటపల్లి మండలాల్లో 20 శాతానికి మించి మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నెలకొంది. సీజన్‌లో సాధారణ వర్షపాతం 913.0 మి.మీకాగా 967.3 మి.మీ నమోదైంది. ఆరు శాతం అధికంగా ఉంది.

కుమురంభీంలో 14 శాతం..



కుమురంభీం జిల్లాలో 14 శాతం అధికంగా నమోదైంది. జైనూర్, వాంకిడి, కౌటాల, చింతలమానెపల్లి, పెంచికల్‌పేటలో మిగులు వర్షపాతం నమోదుకాగా మిగతా మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 999.6 మి.మీకాగా 1144.4 మి.మీ అంటే 14 శాతం అధికంగా నమోదైంది..

నిర్మల్ జిల్లాలో ఇలా..



ఉమ్మడి జిల్లాలోని 19 మండలాలకు పది మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా కుభీరు, తానూరు, భైంసా, కుంటాల, నర్సాపూర్-జి, సారంగాపూర్, సోన్, ఖానాపూర్, దస్తురాబాద్ మండలాల్లో సాధారణం నెలకొంది. సాధారణం 881.8 మి.మీకాగా 1061.7 మి.మీ అంటే 20 శాతం అధికంగా నమోదైంది.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

● పట్టుబడ్డ సరకు విలువ రూ.2.25 కోట్లు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

తలమడుగు, న్యూస్‌టుడే : తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద బుధవారం 292 ప్యాకెట్లలోని 9 క్వింటాళ్ల గంజాయి, కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం వెల్లడించారు. సరకు విలువ రూ.2.25 కోట్లు ఉంటుందన్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి వరంగల్, కరీంనగర్ మీదుగా తెలంగాణ, మహారాష్ట్రలతో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిని అరెస్టు చేసి 8 మందిపై కేసు నమోదు చేశామన్నారు. తలమడుగు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రా, ఒడిశా నుంచి పెద్ద ఎత్తున గంజాయి తరలుతోందని ముందస్తు సమాచారంతో ఉదయం అంత్రరాష్ట్ర రహదారి లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఐచర్ కంటైనర్ వాహనం ఆదిలాబాద్ పట్టణం వైపు నుంచి మహారాష్ట్ర వెళ్తోంది. ఈ క్రమంలో వాహనాన్ని చెక్‌పోస్టు సమీపంలో తనిఖీ చేయగా అందులో 9 క్వింటాళ్ల గంజాయిని, డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు ఉత్తరాఖండ్ హరిద్వార్‌కు చెందిన అన్షుజైన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్, సోను అన్సారి గంజాయి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్, సుక్మా జగదల్‌పూర్ జిల్లాల అటవీ ప్రాంతం నుంచి గంజాయిని పైన పేర్కొన్న ముగ్గురికి డ్రైవర్, క్లీనర్‌లు సరఫరా చేస్తున్నారని వివరించారు. ఆంధ్రా - ఒడిశా అటవీ ప్రాంతంలో 900 కిలోల గంజాయి ఉందని దానిని మహారాష్ట్రలోని బుల్దానా, దూలే జిల్లాలకు తరలించేందుకు వారు రూ.1,50,000 ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండలం మీదుగా మహారాష్ట్ర వెళ్తుండగా పక్కా ప్రణాళికతో పట్టుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంత పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడటం ఇదే మొదటిసారన్నారు. అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, గ్రామీణ సీఐ ఫణిందర్‌ను ఎస్పీ అభినందించారు. వారితో పాటు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, జైనథ్ సీఐడి సాయినాథ్, ఎస్సైలు అంజమ్మ, ముజాహిద్, విష్ణువర్ధన్‌లను అభినందించి నగదు బహుమతి అందించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం

ఉట్నూరు, న్యూస్‌టుడే : తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ వ్యవసాయ సహాయ సంచాలకురాలు సంధ్యారాణి అన్నారు. బుధవారం ఉట్నూరు ఐటీడీఏలోని ఉద్యాన నర్సరీని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి సేద్య పద్ధతిలో పండించే పంటల దిగుబడి గురించి ఆరా తీశారు. పీహెచ్‌ఓ సందీప్ కుమార్, హెచ్‌ఓ సుధీర్ కుమార్, రైతులు పాల్గొన్నారు.


సేంద్రియ కషాయాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

పట్టు తప్పినా వదల్లేదు!


చేప దొరికిందోచ్..


నోటిలో నుంచి జారిపోతూ..


చివరకు గుటుక్కున మింగేసి..

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు జలాశయంలో నీటి కొంగ ఓ చేపను పట్టుకుంది. ఆ చేప నోటిలోంచి జారిపోతున్నా.. ఒడుపుగా నోటితో కరిచి పట్టుకుంది. అయినా ఆ చేప పట్టు విడిపించుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేసింది. ఇంతలో ఆ చేప ఎక్కడ జారిపోతుందో అని ఒక్కసారిగా గాల్లోకి ఎగిరేసి గుటుక్కున మింగేసింది. జలాశయాన్ని చూడటానికి వచ్చిన పర్యాటకులు ఈ దృశ్యం చూసి ఆశ్చర్యపోయారు. - ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, తాంసి

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఉమ్మడి జిల్లా మహిళల జట్టు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల వద్ద బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు రసవత్తరంగా సాగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళలు, పురుషులకు నిర్వహించిన పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ రహీం, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. పురుషులు, మహిళలు నాలుగేసి జట్ల చొప్పున ఆడించారు. మహిళలు, పురుషులు రెండు విభాగాల నుంచి 21 మంది క్రీడాకారుల చొప్పున ఎంపిక చేశారు. వీరికి ఏడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించి టీంకు అవసరమయ్యే 16 మంది చొప్పున రెండు టీంలను ఎంపిక చేస్తారని చెప్పారు. ఆ రెండు జట్లు అక్టోబర్ 9-11 వరకు రంగారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆడుతారని వివరించారు. కార్యక్రమంలో క్రీడా పాఠశాల హెచ్‌ఎం జంగు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, సాఫ్ట్‌బేస్ బాల్ కార్యదర్శి గురవేందర్, హ్యాండ్ బాల్ నేషనల్ రెఫరీ కళ్యాణ్, శిక్షకులు అరవింద్, రాకేష్, రవి, పీడీ, పీఈటీలు గౌరి, హారిక, చిన్నక్క, యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆదిలాబాద్: 90309 25238
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 96031 04720
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, తాంసి:

? తాంసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పక్కన రోడ్డుపై చెట్ల కొమ్మలు విరిగిపడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - లింగాగౌడ్, తాంసి

✔ పంచాయతీ కార్యదర్శికి విషయం తెలియజేసి, వెంటనే కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - గంగన్న, కార్యదర్శి, తాంసి

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ :

? ఆదిలాబాద్ పట్టణంలోని 12వ వార్డులో దుబ్బగూడకు వెళ్లేదారిలో మురుగు నిలవడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికుడు

✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి మురుగు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - పోశెట్టి, హెల్త్ అసిస్టెంట్

టీటీ ఇంజెక్షన్ల సరఫరా

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లిలోని జిల్లా కేంద్రం నుంచి టీటీ ఇంజెక్షన్లు సరఫరా చేశారని పీహెచ్‌సీ వైద్యుడు రాథోడ్ శ్రీకాంత్ తెలిపారు. 'కనిపిస్తే కరిచేస్తున్నాయి' శీర్షికన బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రాజర్షి షా, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారని అన్నారు. పీహెచ్‌సీకి 50 టీటీ ఇంజెక్షన్లు సరఫరా అయ్యేందుకు కృషి చేసిన 'ఈనాడు'కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

వందనం

తలమడుగు, న్యూస్‌టుడే : తలమడుగు జిల్లా పరిషత్తు సెకండరీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం నిర్మించే మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పంచాయతీరాజ్ ఇన్‌ఛార్జి ఈఈ శివరాం పరిశీలించారు. గురువారం 'ఈనాడు'లో 'సారు మా గోడు వినండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ రాజర్షిషా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సంఖ్య, ఇబ్బందుల వివరాలు నివేదిక రూపంలో ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఈఈ శివరాం, ఏఈ నారాయణ పాఠశాలకు వచ్చి స్థలాన్ని పరిశీలించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు పూర్తి కలిసి మాట్లాడి వివరాలు సేకరించారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు. వారితో రవికాంత్‌యాదవ్ పాల్గొన్నారు.


స్థలం వివరాలను అడిగి తెలుసుకుంటున్న పంచాయతీరాజ్ ఈఈ శివరాం

విద్యార్థుల ఆందోళన బాట

బోధకులను నియమించాలని, సౌకర్యాలు కల్పించాలని ఐటీఐ కళాశాల విద్యార్థులు ఇటీవల ఆందోళన బాట పట్టారు. కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. కలెక్టర్‌ను కలిసి తమ సమస్యను ప్రస్తావించారు.



ఎవరికి వారే..!

డీఎం సివిల్ ట్రేడ్ విద్యార్థులు అతికొద్ది మంది వస్తున్నారు. వచ్చిన నలుగురు కలిసి ఇలా సొంతంగా డ్రాయింగ్ పనుల్లో నిమగ్నమవుతున్నారు.



బోధకుల సెలవు.. బోధన కరవు

ఆందోళనలో ఐటీఐ విద్యార్థులు

న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం: ప్రతి నియోజకవర్గానికి ఐటీఐని ఏర్పాటు చేసి యువత ఉపాధి బాటలు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుంటే.. ఆదిలాబాద్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. సొంత భవనం లేమికి తోడు బోధకులంతా వేతనాలు రాక మూకుమ్మడి సెలవులు పెట్టడంతో బోధన నిలిచి విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

స్వయం ఉపాధితో పాటు ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగం పొందేలా ఆదిలాబాద్ ఐటీఐలో ఆరు ట్రేడ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో ఎలక్ట్రీషియన్, సివిల్, డ్రెస్ మేకింగ్, స్టెనో, కోపా(కంప్యూటర్), వెల్డర్ ట్రేడ్లలో మొత్తం 165 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలలో ప్రిన్సిపల్ మినహా ఇతర పోస్టులకు రెగ్యులర్ బోధకులు లేరు. ఉన్న ప్రిన్సిపల్ సైతం సెలవు పెట్టారు. ఆయన స్థానంలో ఉట్నూరు కళాశాల ప్రిన్సిపల్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. బోధనేతర సిబ్బంది విషయంలో ఇబ్బందులు లేకపోయినా బోధన విభాగం ట్రైనింగ్ ఆఫీసర్‌తో సహా ఆరు డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులు ఏళ్లుగా భర్తీకి నోచుకోవడం లేదు. నలుగురిని తాత్కాలికంగా నియమించి నెట్టుకొస్తున్నారు. ఇందులో ముగ్గురు కాంట్రాక్టు ప్రాతిపదికన, మరొకరు అతిథి అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ముగ్గురికి ఏడు నెలలుగా.. ఒకరికి 17 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. విసుగు చెందిన వారంతా మూకుమ్మడి సెలవులు పెట్టారు. వారం రోజులుగా విధులకు హాజరు కావడంలేదు. ఫలితంగా బోధన నిలిచిపోయింది. కళాశాల ప్రాంగణంలో రూ.4.60 కోట్ల అంచనా వ్యయంతో ఏటీసీ భవన నిర్మాణ పనులు జరుగుతుండగా.. శిథిల గదుల్లో బోధన సాగిస్తున్నారు.

ట్రేడులు	విద్యార్థులు
కోపా	42
డ్రెస్ మేకింగ్	18
స్టెనో	24
వెల్డర్	33
ఎలక్ట్రీషియన్	36
సివిల్	12
మొత్తం	165

ఎంతో ఆశతో చేరాం



సాక్షి, కోపా ట్రేడ్ విద్యార్థిని

ఐటీఐలో చేరితే త్వరగా స్థిరపడవచ్చని ఆశతో కోపా ట్రేడ్‌లో చేరాం. ఆరు వారాలుగా తరగతులు జరగడం లేదు. ప్రిన్సిపల్ సెలవు పెట్టారు. ఎవరిని సంప్రదించాలో తెలియక గత్యంతరం లేక ఆందోళనకు చేయాల్సి వచ్చింది. పగుళ్లు తేలిన భవనం ఎప్పుడు కూలుతుందోనని భయం వేస్తోంది.

అప్పుడు గట్టెక్కాం.. ఇప్పుడెలాగో?



- అబ్దుల్లా, సివిల్ ట్రేడ్ విద్యార్థి

మొదటి సంవత్సరం ఎలాగోలా తంటాలు పడి గట్టెక్కాం. ఆరువారాలుగా బోధకులు మూకుమ్మడి సెలవు పెట్టడంతో పాఠాలు చెప్పేవారు, ప్రయోగాలు చేయించేవారు లేరు. అడ్వాన్సు టెక్నాలజీ సెంటర్ పేరిట రూ.కోట్లు వెచ్చించి భవనం నిర్మించే బదులు ఇప్పుడున్న ఐటీఐలను బలోపేతం చేయాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్

బోధకులు మూకుమ్మడి సెలవు పెట్టిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఐఎంసీ నిధుల నుంచి వారికి వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. వారిని తిరిగి విధుల్లో చేరేలా చూస్తాం. భవన మరమ్మతు విషయంలోనూ పాలనాధికారికి నివేదించాం.

ప్రేమికుల కథ విషాదాంతం
చికిత్స పొందుతూ ప్రియురాలి మృతి

క్రైం కార్నర్

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రేమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరనే మనస్తాపంతో ప్రేమికులు పురుగు మందు తాగిన ఘటనలో ప్రియుడు సోమవారం రాత్రి మృతి చెందగా.. ప్రియురాలు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఉట్నూరు ఎస్సై మనోహర్ కథనం మేరకు.. కన్నాపూర్ పంచాయతీ రాంజీగూడకు చెందిన ఆత్రం హన్మంత్ రావు(22), నార్నూర్ మండలానికి చెందిన యువతి(17) ప్రేమించుకున్నారు. పెద్దలు పెళ్లికి అంగీకరించరన్న మనస్తాపంతో ఈ నెల 23న చేనులో పురుగు మందు తాగారు. ప్రియుడు సోమవారం రాత్రి.. ప్రియురాలు ఆదిలాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాగులో పడి వృద్ధురాలు..

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉట్నూరు మండలం శంకర్‌తండాకు చెందిన వృద్ధురాలు వాగులో పడి మృతి చెందింది. ఎస్సై మనోహర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పవార్ లచ్చిబాయి(65) మతిస్తిమితం కోల్పోయింది. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన ఆమె రాత్రి అయినా తిరిగిరాలేదు. కుమారుడు బిక్కు స్థానికులతో కలిసి గాలించినా ఆచూకీ దొరకలేదు. బుధవారం గ్రామ సమీపంలోని వాగులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


లచ్చిబాయి

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


కైలాస్

బోథ్, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోథ్ మండలం నాగాపూర్‌కు చెందిన కోట్నాక కైలాస్(34) శనివారం తన ద్విచక్ర వాహనంపై బోథ్‌కు వెళ్లి నాగాపూర్‌కు తిరిగి వెళుతుండగా ధన్నూర్ గ్రామ సమీపంలో ఆగి ఉన్న ఎడ్లబండిని బలంగా ఢీకొట్టాడు. అతడిని బోథ్ సీహెచ్‌సీకి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. అతడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం

బోథ్, న్యూస్‌టుడే : అప్పులబాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు. బోథ్‌లోని మరాఠీగల్లీకి చెందిన సోలంకి రవి(31) కుటుంబ పోషణ, వ్యాపారం నిమిత్తం పలు ప్రైవేటు బ్యాంకులలో గతేడాది దాదాపు రూ.2,42,000 రుణాలు తీసుకున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురవుతున్నాడు. మంగళవారం సాయంత్రం నుంచి ఇంటికి రాలేదు. బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ పంట పొలంలో ఉరేసుకొని ఉండటాన్ని గమనించిన పొలం యజమాని స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. అతడికి భార్య శ్యామల, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తల్లి జీజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


సోలంకి రవి

★ రెండు నెలల కిందట పెద్ద కుమారుడు రమేష్ అనారోగ్యంతో చనిపోయాడు. ఇప్పుడు చిన్న కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లి, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : తన బంధువును తీసుకెళ్లాడన్న కోపంతో నేరస్థులు బాధితుడిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన కేసులో ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.శివరాంప్రసాద్ నలుగురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.ఒక వేయి చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించారు. మంచిర్యాల జిల్లా లైజన్ అధికారి సయ్యద్ తాజ్‌ఉద్దీన్ వివరాల ప్రకారం.. బాట్ల అన్వేష్ అనే యువకుడు తన బంధువును తీసుకెళ్లాడని హరీశ్‌కుమార్‌గౌడ్ తన స్నేహితులు ముత్యం సాయి, పట్క్యారి ప్రశాంత్, మొహ్మద్ అజ్మత్‌ఖాన్‌లు బాధితుడిని కొట్టి, కులం పేరుతో దూషించటంతో పాటు మూత్రం తాగించి హింసించారు. బాధితుడు అన్వేష్ 2020 మే 16న మంచిర్యాల జిల్లా జన్నారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ ఎం.వినోద్‌కుమార్ కేసు నమోదు చేయగా ఏసీపీ జి.నరేందర్ ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. సాక్షులను విచారించి న్యాయమూర్తి పైమేరకు శిక్షను ఖరారు చేశారు. జన్నారం ఎస్‌ఐ రాజవర్ధన్, సీఐ నరేందర్‌లను రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ అభినందించారు.

చించర్‌వాడలో చోరీ

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : పట్టణంలోని చించర్‌వాడలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు ఆదిలాబాద్ రెండో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న పాల్దేవార్ శ్యాం మంగళవారం రాత్రి భోజనాలు చేసి పడుకున్నారు. బుధవారం ఉదయం లేచి చూడగా తలుపులు తీసి ఉండటం, ఇంట్లో ఉండాల్సిన పెట్టె కనిపించలేదు. అందులో రూ.రెండు తులాల బంగారు నగలు, రూ.ఒక లక్ష నగదు చోరీ అయినట్లు ఆయన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కార్యకర్త పాడె మోసిన మాజీమంత్రి

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : గుండెపోటుతో మృతి చెందిన పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన భారాస నాయకుడు గోలిశంకర్(40) అంతిమయాత్రలో బుధవారం పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న, పురపాలక అధ్యక్షుడు జోగుప్రేమేందర్ ఆయన పాడె మోసి నివాళులర్పించారు. భారాస, కాంగ్రెస్, భాజపా, హిందూ ఉత్సవసమితి, తెలంగాణ జాగృతి నివాళులర్పించారు.


గోలిశంకర్ పాడె మోస్తున్న జోగు రామన్న

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బోథ్, న్యూస్‌టుడే : మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం బోథ్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు వినియోగించుకున్నారు. తన సోదరుడు మాసం కిరణ్ మొదటి వర్ధంతి సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 50 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించామన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

ఇంద్రవెల్లి, ఉట్నూరు, పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను వక్తలు కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు.


ఇంద్రవెల్లిలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు


ఆదిలాబాద్‌లో భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్


ఉట్నూరులో..

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ఉట్నూరు, న్యూస్‌టుడే : ప్రతికూల పరిస్థితులను చూసి అధైర్యపడొద్దని ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఐటీడీఏ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ మెస్రం మనోహర్ పేర్కొన్నారు. బుధవారం ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వాగతోత్సవంలో ఆయన పాల్గొన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించే వరకు విద్యార్థులు పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. ప్రిన్సిపల్ ప్రతాప్‌సింగ్, వైస్ ప్రిన్సిపల్ సాయి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేయాలి

అధికారులకు పాలనాధికారి ఆదేశం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాలు, కస్తుర్బాల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా పాలనాధికారి రాజర్షిషా పోషణ చర్చా కార్యక్రమం రూపొందించారు. మండలస్థాయిలో, పురపాలక స్థాయిలో అధికారులు ప్రతి వారం రెండు విద్యా సంస్థలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ గోడ ప్రతులను ఆవిష్కరించారు. బ్యాంకు అధికారులతో త్రైమాసిక సమీక్ష నిర్వహించారు. పంట రుణాలు, రుణమాఫీ, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాల అమలుపై బ్యాంకుల వారీగా సమీక్షించారు. ఎల్‌డీఎం శేఖర్, డీఆర్‌డీవో సాయన్న, సీఎస్‌సీ ప్రాజెక్టు మేనేజరు హరికృష్ణ, జిల్లా మేనేజరు రాహుల్, జిల్లా పరిశ్రమల మేనేజరు పద్మభూషన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, వయోవృద్ధులు, అధికారులు

108, 102 వాహనాల తనిఖీ

బోథ్, న్యూస్‌టుడే : బోథ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్ మండలాల 108, 102, 1962 వాహనాలను ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజరు సామ్రాట్ తనిఖీ చేశారు. వాహనాల పనితీరును పరిశీలించారు. జిల్లా ఉత్తమ పైలెట్లుగా నిలిచిన స్వామి, మహేశ్‌కుమార్‌లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. క్వాలిటీ ఆడిటింగ్ అధికారి కిశోర్, జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


బోథ్‌లో ఉత్తమ పైలెట్‌లకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న జిల్లా ప్రోగ్రాం మేనేజరు సామ్రాట్

జాతీయస్థాయిలో రాణించాలి

ఉట్నూరు న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక రంగస్థల కార్యక్రమాల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. ఉట్నూరు ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు కళాత్మక పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఐటీడీఏ పీవో వారిని అభినందించారు. ఒడిశాలో నిర్వహించే జాతీయ పోటీల్లో పాల్గొని రాణించాలన్నారు.


విద్యార్థులతో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కబ్జాదారుల వివరాలు పంపండి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వాగుల పక్కన ప్రభుత్వ భూములను కబ్జా చేసి గృహాలు నిర్మించిన వారి పూర్తి వివరాలను అందజేయాలని ఉట్నూరు సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ముందున్న వాగును కబ్జా చేసి భవనాలను నిర్మిస్తున్నారని స్థానికులు ఇటీవల సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం మండల కేంద్రానికి వచ్చి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక అధికారి సంజీవ్‌రావు, మార్కెట్ శాఖ అధికారులతో మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ రెండు ముఖద్వారాలను ఏర్పాటు చేస్తే ఒక దానిని ఎందుకు మూసివేశారని ప్రశ్నించారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఉట్నూరు సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానంలో నిలవాలని ఎంపీడీఓ లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్వాగతోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థుల నృత్యాలతో అలరించారు. కార్యక్రమ నిర్వహణ కోసం ఎట్టెం రాములు రూ.5 వేల విరాళం అందించారు. అధ్యాపకులు సరస్వతి, మురళీ, అనిత, మధు, సరితారాణి, దయాకర్ తదితరులు ఉన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

సంక్షిప్తం

ఎంఈవోలుగా బాధ్యతల స్వీకరణ

నార్నూర్ : నార్నూర్ నూతన ఎంఈవోగా అనిత పవార్, గాదిగూడ మండల నూతన ఎంఈవోగా తాడిహత్నూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ మానేలు బాధ్యతలు స్వీకరించారు.

ఆదిలాబాద్ గ్రామీణం: ఆదిలాబాద్ గ్రామీణ మండల విద్యాధికారిగా ముజాఫర్ హుస్సేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

రక్త నమూనాల సేకరణ

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించే బాలికల్లో రక్తహీనత శాతం గుర్తించటానికి గిరి పోషణ్ మిత్ర ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో 444 మంది బాలికల రక్త నమూనాలను సేకరించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: రోడ్డు భద్రత, గమ్యం యాప్‌పై ప్రతి ప్రయాణికుడు అవగాహన కలిగి ఉండాలని ఆర్టీసీ ఉట్నూరు డిపో ఇన్‌ఛార్జి డీఎం కల్పన అన్నారు. బుధవారం ఇంద్రవెల్లి అంబేడ్కర్ కూడలిలోని బస్టాప్ వద్ద అవగాహన కల్పించారు. విలేజ్ బస్సు అధికారి సతీష్, ఇంద్రవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉత్తం, పట్టణ శాఖ అధ్యక్షుడు జహీర్ పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం: జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో గురువారం అండర్-17 బాలికల జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు తెలిపారు. వివరాలకు 94935 34163 నెంబరును సంప్రదించాలని కోరారు.

హేటిని పంచాయతీగా ప్రకటించాలి

బేల: మండలంలోని హేటి గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలంటూ బుధవారం ఆ గ్రామస్థులు తహసీల్దార్ కె.రఘునాథ్, ఎంపీడీఓ మహేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ నేత బండి సుదర్శన్, గ్రామస్థులు జోడే గణేష్, రాంకిషవ్, రాందాస్, విష్ణు పాటిల్, కృష్ణకుమార్, అర్జున్ తదితరులున్నారు.

వివాహిత అదృశ్యం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ పంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్ గ్రామానికి చెందిన వివాహిత ప్రియాంక(33) అదృశ్యమైనట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మండల కేంద్రంలోని నానమ్మ ఇంటికి వచ్చిన ప్రియాంక మంగళవారం నుంచి కనిపించడం లేదని, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

నిర్మల్ పట్టణం: ఆదిలాబాద్‌కు చెందిన ఓ విద్యార్థి (14) బుధవారం అదృశ్యమయ్యాడు. అతడిని నిర్మల్‌లో చూసిన బంధువులు బాలుడి తండ్రికి సమాచారం అందించారు. తల్లిదండ్రులు డయల్ 100కు ఫోన్‌చేశారు. వారందించిన వివరాల ఆధారంగా నిర్మల్‌లో పెట్రోకార్ సిబ్బంది స్థానిక బస్టాండ్ సమీపంలో గాలింపు చేపట్టారు. అక్కడ విద్యార్థిని గుర్తించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

తలమడుగు, ఆదిలాబాద్ అర్బన్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు గోక గణేష్‌రెడ్డి కలిసి సత్కరించారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి బుధవారం మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు.

ఆక్రమణల తొలగింపు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : రిమ్స్ ఎదుట ఆక్రమణలను పోలీసుల ఆధ్వర్యంలో పురపాలక సంఘం సిబ్బంది బుధవారం తొలగించారు. పురపాలక కమిషనర్ ఖమర్ అహ్మద్ సమక్షంలో జేసీబీ సాయంతో అక్కడున్న నిర్మాణాలను కూల్చివేశారు. రిమ్స్ విద్యార్థుల భద్రత దృష్ట్యా జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించినట్లు రిమ్స్ సంచాలకుడు రాఠోడ్ జైసింగ్ తెలిపారు. వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపించినట్లు పురపాలక కమిషనర్ తెలిపారు. సీఐ కరుణాకర్‌రావు బందోబస్తును ఏర్పాటు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాలనాప్రాంగణం : బంగారుగూడ ఆదర్శ పాఠశాలలో గంటల బోధన ప్రాతిపదికన పీజీటీల ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.శివాజీ తెలిపారు. కామర్స్ పీజీటీ కోసం ఎంకాం, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు 28లోగా పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

జైనథ్ : జైనథ్ ఆదర్శ పాఠశాలలో గంటల ప్రాతిపదికన బోధించడానికి అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ రాము ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ విభాగంలో ఆంగ్లం, ఎకనామిక్స్, కామర్స్, పొలిటికల్ సైన్స్, హిందీ, టీజీటీ విభాగంలో ఆంగ్లం, సైన్స్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 లోపు ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం భాజపాయే

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం భాజపాయేనని ఆ పార్టీ కేంద్ర సంఘటన్ మంత్రి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆయన జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్‌తో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక వినాయక్‌చౌక్‌లోని వ్యాపార సముదాయాలను తిరిగి ఆన్‌లైన్‌లో ప్రత్యేకయాప్‌లో సభ్యత్వ నమోదు చేయించారు. నాయకులు ఎన్రాల నగేష్, విజయ్‌బోయర్, మయూర్‌చంద్ర, లాలామున్నా, ఆకుల ప్రవీణ్, జోగురవి, సిద్దు, కృష్ణయాదవ్, సోమ రవి, నివేదితవర్మ తదితరులు పాల్గొన్నారు.